

# భారతీయ సినిమాల్లో స్త్రీమూర్తులు

వారాల ఆనంద్



ఈ రోజుల్లో ఐతే చాలా సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం ఆటబొమ్మలుగా ఉంటున్నాయి కానీ దశాబ్దాలుగా వచ్చిన ఇండియన్ సినిమాని పరిశీలిస్తే స్త్రీ పాత్రలకి పెద్దపీట వేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అన్ని భారతీయ భాషలనుంచీ స్త్రీ పాత్రలని ప్రధానంగా చిత్రీకరించిన ఉత్తమ సినిమాల పరిచయాలు .. నెలకి రెండు సినిమాల చొప్పున.

కళాత్మక చిత్రాభిమాని ఆనంద్‌గారు కవి, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, దర్శకులు కూడ. ఒక కవితా సంపుటిని, సినిమాల మీద నాలుగు పుస్తకాలని రచించారు. కళాత్మక చిత్రోత్సవాల నిర్వహణలో విశేషానుభవం ఉంది. **varalaanand**@hotmail**.com**

## గిద్

**భాష:** కన్నడ, **స్క్రీన్ ప్లే, దర్శకుడు** – టి.ఎస్.రంగా;

**నటీనటులు** – స్మితాపాటిల్, ఓంపురి, ఎం.కె.రాయినా, అచ్చుత్ పోతేదార్

**విడుదల:** 1985

**స్త్రీని విలాస వస్తువుగానూ,** వినియోగ వస్తువుగానూ పరిగణించడం మన వ్యవస్థలో అనాదిగా వస్తున్నది. ఆ స్త్రీ అట్టడుగు వర్గానికి చెందినది అయినప్పుడు పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుంది. బూర్జువా సమాజంలో అధికారమో ఆధిపత్యం చెలాయిస్తే ఈ పురుష స్వామ్యం పెట్టుబడిదారి సమాజంలో ధనం, వినోదాల ఎరచూపి ఆ స్త్రీని అణచి వేతకు గురిచేయడం ఆమె శీలాన్ని జీవితాన్ని ఆటవస్తువుగా ఉపయోగించుకోవడమ మనం చూస్తూనే ఉన్నాం. ముఖ్యంగా అట్టడుగు బడుగు వర్గాల స్త్రీలను దేవుని పేర, ఊరు పరం చేసే ఆచారాలు అనేకం మన దేశంలో నెలకొని ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాలో నేటికీ కనిపించే జోగిని వ్యవస్థ అలాంటి వాటిలో ఒకటి. అలాగే దేవదాసీలను చేయడం. గడీల్లో దాసీలను ఏర్పాటు చేసుకోవడం మన తెలంగాణా చరిత్రలో చూశాం.

అలాంటి ఆచారమొకటి కర్నాటకలో కూడా నెలకొని ఉంది. దాదాపుగా జోగిని వ్యవస్థలాంటిదే ఆ స్థితి కూడా. కర్నాటకకూ, మహారాష్ట్రకూ నడుమ సరిహద్దు ప్రాంతాల్లో ఈ ఆచారం అమలులో ఉంది. ఆ వ్యవస్థ అసలు రూపాన్ని వివరిస్తూ కథనాత్మకంగా టి.ఎస్.రంగా 'గిద్' చిత్రం నిర్మించారు. 1984-85ల మధ్య నిర్మితమైన ఈ చిత్రానికి బెంగుళూరు కేంద్రంగా పనిచేస్తున్న జాయింట్

ఉమెన్స్ ప్రోగ్రామ్స్ సంస్థ నిర్వహించిన అధ్యయనం మూలాంశంగా పనిచేసింది. ఆ సంస్థ సర్వే చేసి నిర్ధారించి చెప్పిన అంశాల్ని ప్రాతిపదికగా చేసుకుని గిద్ ను వాస్తవాల్ని ఆవిష్కరించే డాక్యుమెంటరీ నిర్మాణ పద్ధతిలో సాధికారిక చిత్రంగా నిర్మించారు రంగా. ఎల్లమ్మ దేవత పేర వయస్సులో ఉన్న యువతులను ఊరుమీద విడిచేయడం, భూస్వాములు, వ్యాపారులు, పూజారులు కుమ్మక్కై పడుచు పిల్లల్ని ఉపయోగించి బాంబేలోని రెడ్‌లైట్ ఏరియాకు పంపించేయడం లాంటి అమానవికమైన యదార్ధ సంఘటనల్ని ఆధారం చేసుకుని గిద్ చిత్ర కథ రూపొందింది.

పేదరికం ఉన్న ఆ ప్రాంతంలో హరిజన కుటుంబాల్లో ఎల్లమ్మ దేవతకి పెద్ద మనుషులతో తమ కూతుళ్ళని అర్పించేస్తారు. ఆ సమయానికి ఎల్లమ్మ గుడిలో గంటలు ఎడతెరిపి లేకుండా మోగుతుంటే ఊర్లోని ధనవంతుడైన వాడికి దేవుని పేర ఆ అమ్మాయిని సమర్పిస్తారు. అతని అవసరం తీరాక ఆమె ఇక ఊరు వస్తువు అయిపోతుంది. ఏ యువతికైనా తల వెంట్రుకలు చిక్కుపడి అట్టలు కడితే ఆమెను ఎల్లమ్మగా భావిస్తారు. ఇక ఇప్పుడా ఆచారం మరో దారిపట్టింది. దేవుని పేర వదిలేసిన ఆ యువతి అనంతర కాలంలో ఆ కుటుంబానికి ఆధారమవుతుంది. తన శీలాన్ని అమ్మకానికి పెట్టి కుటుంబాన్ని పోషిస్తుంది. దానికోసం బాంబే హైవేపైన వృత్తి నిర్వహించడం లేదా బొంబాయి రెడ్ లైట్‌కి వెళ్ళిపోవడమూ జరుగుతుంది. ఇలా వెర్రి తలలు వేసుకున్న ఆచారాన్ని ఆధారం చేసుకుని 'గిద్' కథనాత్మకంగా నిర్మితమైంది. పదేళ్ళ లక్ష్మిని ఊరంతా ఎల్లమ్మకు అర్పించడానికి ప్రయత్నిస్తూ ఉంటే ఆ ఊళ్ళో టీచరుగా పనిచేస్తున్న ఓ ప్రగతి శీల యువకుడు దీన్ని ప్రతిఘటిస్తూ ఉంటాడు.

కానీ ఆయన యత్నాలన్నీ విఫలమైపోతున్న తరుణంలో అదే ఊర్లో ఉన్న వేశ్య హనుమి ఆచారపు కోరల్లోంచి లక్ష్మిని కాపాడేందుకు ముందుకు వస్తుంది. కానీ లక్ష్మి తల్లి ఆచారం ప్రకారం తన కూతుర్ని ఆ ఊరి భూస్వామికి సమర్పించుకోకుండా ఉంటే ఎల్లమ్మ దేవత ప్రేమించిన బాస్య హనుమికి అండగా నిలుస్తాడు. ఆదర్శవంతుడైన స్కూలు టీచరు సాధించలేని పనిని హనుమి బాస్య సాయంతో పూర్తి చేస్తుంది. ఊరిని ఎదిరించి లక్ష్మిని వెంట తీసుకుని ఆ ఇద్దరూ పారిపోతారు. కానీ హైవే మీదికి వచ్చే సరికి బాంబే బస్సు సుదూరంగా వెళ్ళిపోతూ కనిపిస్తుంది. చిత్రం సమస్యకు స్పష్టమైన పరిష్కారాల్ని చూపదు కానీ ఆ అమానవికమైన ఆచారానికి వ్యతిరేకంగా గళమెత్తిన హనుమి పాత్రలో చిత్రం ఆత్మను నింపాడు దర్శకుడు. హనుమి తన జీవితంలో వైఫల్యం చెంది రోగాలతో అలమటిస్తున్నప్పటికీ సనాతనమైన ఆచారాన్ని దురాగతాన్ని ఎదిరించి నిలిచి పోరాడుతుంది. హనుమి పాత్రలో స్మితాపాటిల్ అద్భుతమైన నటనను ప్రదర్శించింది. వాస్తవికత ఉట్టిపడుతూ ఉండగా హనుమి పాత్ర గొప్ప స్ఫూర్తినిస్తుంది. అయితే గిద్ చిత్రం జోగినీ వ్యవస్థపైన జాలిని కాని, కోపాన్ని కానీ రేకెత్తించదు. అది కేవలం ఆ వ్యవస్థను మన కళ్ళముందు యదార్ధ దృక్పథంతో ఆవిష్కరిస్తుంది. ఎలాంటి ఎమోషనల్ నోట్‌ని కూడా కలిగించదు. కానీ ఒక దురన్యాయాన్ని, దురాచారాన్ని మన కళ్ళముందు నిజాయితీగా ఉంచుతుంది చిత్రం. 80వ దశకం మొదటి పాదంలోనే నిర్మితమైనప్పటికీ, టి.ఎస్.రంగా అత్యంత నిబద్ధతతో చిత్రనిర్మాణం చేసినప్పటికీ గిద్ అనేక మందిని ఆకర్షించడంలో విఫలమైంది. ప్రయోగాత్మకమైన ప్రగతి శీల చిత్రంగా మిగిలిపోయింది. స్మితాపాటిల్ నటన చిత్రాన్ని సజీవంగా ఉంచుతుంది. వేశ్యావృత్తి పైన కర్నాటక దేవదాసీ వ్యవస్థపైన నిర్మించిన సాధికారిక చిత్రంగా 'గిద్' మిగిలిపోయింది.

●●●

## ఇండియా క్యాబరే

డాక్యుఫీచర్ (దర్శకత్వం - మీరానాయర్)

**విడుదల:** 1986

**అత్యంత ప్రతిభావంతమైన** దృశ్య శ్రవణ మాధ్యమమైన 'సినిమా' తెరపైన స్త్రీని వినియోగ వస్తువుగానూ, వినోద సాధనంగానూ చిత్రించడం మొదట్నించీ వస్తున్నది. అనేక సామాజిక, ఆర్థిక కారణాల నేపథ్యంలో వ్యభిచార వృత్తిలోనూ, డాన్సింగ్ గర్ల్స్‌గానూ, కోఠావాలీగానూ మారిన స్త్రీల జీవిత ఇతివృత్తాలలో భారతీయ సినిమా రంగంలో అనేక సినిమాలు వచ్చాయి మూకీయుగం నుంచి కూడా ఆ ఒరవడి మనకు కనిపిస్తుంది. మొగల్ ఎ అజం, పాకీజా, దేవదాస్ లాంటి సినిమాల్లో ఉదాత్తమయిన పాత్రల్ని సృష్టించారు. ప్యాసా లాంటి సినిమాల్లో వ్యభిచార స్త్రీ పాత్రని అత్యున్నత స్థానమిచ్చి నిర్మించారు. కానీ స్త్రీ పాత్రని వ్యాంప్‌గా, సెక్స్ డాన్సర్లుగా లెక్కలేనన్ని సినిమాల్లో చొప్పించి వారిని వేరొక ప్రత్యేకమయిన జీవులుగా చిత్రించే ప్రయత్నమూ జరిగింది. అంతేకాదు క్లబ్ నృత్యాలు చేయడం కోసం, అంగాంగ ప్రదర్శనలు చేయడం కోసం కొంత మంది డ్యాన్సర్లను కూడా మన సినిమా రంగం తయారు చేసింది. పాశ్చాత్య దేశాల్లోనూ, మహానగరాల్లోనూ, క్లబ్బుల్లో కనిపించే క్యాబరే నృత్యరీతుల్ని మరింత దిగజారుడు తనంతో మన సినిమాల్లో ప్రదర్శించడమూ జరిగింది. క్యాబరే డాన్సర్లు బార్ రూముల్లో సెక్సీగా నృత్యాలు చేయడానికి బాస్‌లకు, డాన్‌లకు విందు వినోదాల్ని అందించడానికి ఉపయోగపడే జీవులుగానే మన సినిమా రంగం చూపిస్తూ వచ్చింది. అంతే తప్ప నిజజీవితంలో క్యాబరే డాన్సర్ల వాస్తవస్థితుల్ని, మనోభావాల్ని, సమాజంలో వారికిచ్చే స్థానాన్ని అధ్యయనం చేసి క్యాబరే డాన్సర్ల 'జీవన చిత్రం'పైన సాధికారికమయిన సినిమాని మీరానాయర్ 1986 లో నిర్మించారు.

'సలాంబాంబే' చిత్రంతో అంతర్జాతీయ ఖ్యాతిని అందుకున్న మీరానాయర్ నిజానికి తన 'ఇండియా క్యాబరే'తోనే అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఆర్థిక కారణాలతో తమ శరీరాల్నే తమ జీవనాధారంగా చేసుకుని అత్యంత దయనీయంగా బతుకుతున్న ఆ స్త్రీ లోకాన్ని అతి దగ్గరగా చూపి సజీవ పాత్రల్లో మీరానాయర్ నిర్మించిన ఈ సినిమా 1986లో హైదరాబాద్ లో ఫిల్మోత్సవ్ సందర్భంగా ఉమెన్స్ సినిమా కార్యక్రమంలో ప్రారంభ చిత్రంగా ప్రదర్శించబడింది. సనాతనంగా పురుషాధిపత్యంతో కొనసాగుతున్న మన సమాజంలో క్యాబరే డాన్సర్‌లను వినోదం కోసం, సంతోషం కోసం ఎంతగా వినియోగించుకుంటారో తర్వాత వెలుతురు ప్రపంచంలో వారికి ఏ స్థానం ఇస్తారో కూడా ఇండియా క్యాబరేలో దర్శకురాలు చర్చకు పెడుతుంది. అర్థవంతమయిన విమర్శనాత్మక మయిన చర్చను లేవదీసిన 'ఇండియా క్యాబరే' కేవలం 60 నిమిషాల నిడివిగల చిత్రం. దీని చిత్రీకరణ పద్దతి విలక్షణంగా సాగింది. డాక్యుమెంటరీ మరియు ఫీచర్ ఫిల్మ్ నిర్మాణ పద్దతుల్ని రెండింటినీ సమన్వయం చేసి 'డాక్యు ఫీచర్'గా ఈ సినిమాని రూపొందించారు మీరానాయర్.

ఇండియా క్యాబరేలో కనిపించే స్త్రీ పాత్రలు సాధారణంగా భారతీయ సినిమాల్లో కనిపించే అమ్మ, చెల్లి, ప్రేయసి, భార్యలాంటి సాధారణ స్త్రీలు కాదు. వారు విలక్షణమయిన జీవులు, మన దేశంలో అంత ఎక్కువ సంఖ్యలో లేకున్నప్పటికీ ఆ క్యాబరే డాన్సర్ల జీవన చిత్రణలో మొత్తంగా మన సమాజంలో స్త్రీకి ఉన్న స్థానాన్ని గురించిన చర్చను లేవదీసింది దర్శకురాలు మీరానాయర్.

'ఇండియా క్యాబరే' స్త్రీలు బొంబాయిలోని మేఘరాజ్ అనే రాత్రి క్లబ్‌లో నృత్యం చేసేవారు. ఆ క్లబ్‌కు వచ్చే ఉన్నత, మధ్య తరగతి పురుష కస్టమర్లకు వినోదాన్ని అందించడమే వారి వృత్తి. వారు నిర్వహించేది వృత్తే అయినప్పటికీ రాత్రిపూట నృత్యం వేళ వారికిచ్చే విలువ, తెల్లారేసరికి వారిని సాంఘికంగా ఎంత హీనంతో చూస్తారో వారికి తెలుసు. ఆ స్థితిని వారు ఎట్లా స్వీకరిస్తారో, వారు వారి వృత్తిపట్ల, జీవితం పట్ల ఏ దృక్పథంతో ఉంటారో 'ఇండియా క్యాబరే'లో అతి సన్నిహితంగా చూపిస్తారు. ఇందులో క్యాబరే డాన్సర్‌ల సాధారణ నిజజీవితమూ, వారిని మేకప్ గదులు ఎంతలా మార్పునకు గురిచేస్తాయో, బికినీల్లోనూ, గౌన్లలోనూ వారు రాత్రి రాణులుగా ఎట్లా మారిపోతారో ఈ చిత్రంలో స్పష్టంగా చిత్రీకరించబడింది. సినిమా నిర్మాణ రీతి ప్రధానంగా ఇంటర్వ్యూల రూపంలో సాగినందువల్ల

క్యాబరే డ్యాన్సర్లు తమ గతాన్ని, తమ చరిత్రని, తాము డాన్సర్లుగా మారిన పరిస్థితుల్ని, వారి కుటుంబ సంబంధాల్ని, తమ కళని, ఊహల్ని భవిష్యత్ పట్ల వారి భయాల్ని వివరిస్తారు. మొత్తంగా ఫస్ట్ హేండ్ సమాచారంలో సినిమా సాగుతుంది. క్లబ్‌కు వచ్చే అనేక మంది కస్టమర్లలో విజయ్ ప్రతిరోజూ క్రమం తప్పకుండా వస్తాడు. అతను వ్యాపారవేత్త, సినిమా క్రమంగా ఆయనను ఫాలో అయి ఆయనతోపాటు ఆయన ఇంటికి వెళుతుంది. రంగం క్లబ్ నుంచి విజయ్ ఇంటికి మారుతుంది. కుటుంబ వ్యవస్థలో ఉన్నత స్థానం పొందినట్టుగా కనిపించే భార్య, తల్లి, కోడలు తదితర పాత్రల వాస్తవ స్థితిగతుల్ని క్రమంగా మనకు చూపిస్తుంది. కుటుంబం, విలువలు, అనుబంధాలు అన్న నేపథ్యంతో సమాజంలో స్త్రీలు కూడా ఎంత అణచివేతకు, నిరాదరణకు గొరౌతున్నారో ఇండియా క్యాబరే చూపించే ప్రయత్నం చేస్తుంది. విజయ్ భార్య కుటుంబంలోనూ, భర్త వద్ద తనకున్న పరిమితుల్ని స్పష్టంగా ఎరిగి ప్రవర్తిస్తూ ఉంటుంది. అలా సామాజిక వాస్తవాల్ని సినిమా మనముందు పరుస్తుంది. ఇండియా క్యాబరేలో ప్రధాన పాత్రలయిన అమీనా, రేఖలు నేరుగా ప్రేక్షకులతో మాట్లాడుతున్నట్టుగా మాట్లాడుతారు.

ఈ చిత్రంలో మీరానాయర్ స్పష్టమైన స్త్రీ దృక్పథంతో స్త్రీ సమస్యని ముఖ్యాభినేతగా చేసి సామాజిక దగుల్బాజీ లక్షణాల్ని ప్రతిభావంతంగా చిత్రీకరించారు.

"ఇండియా క్యాబరే" న్యూయార్క్‌లో జరిగిన గ్లోబల్ విలేజి ఫిలిం ఫెస్టివల్‌లో డాక్యుమెంటరీ అవార్డును, ఎథెన్స్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో గోల్డెన్ ఎథెనా అవార్డును, అమెరికన్ ఫిలిం ఫెస్టివల్‌లో బ్లూరిబ్బన్ అవార్డును గెలుచుకుంది.

మీరానాయర్ ఆ తర్వాత నిర్మించిన 'సలాం బాంబే', 'మిసిసిపి మసాలా' తదితర చిత్రాలకి 'ఇండియా క్యాబరే' ఓ ప్రిల్యూడ్‌గా ఉంటుంది. క్యాబరే జీవితాలపై నిర్మితమైన సాధికారిక డాక్యుఫీచర్ ఫిల్మ్ 'ఇండియా క్యాబరే'

●●●

Click here to share your comments on this article.